# కదిరి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మంచి ఫలితాలు

## కూటమి సమన్వయంతో పనిచేయాలి: విష్ణువర్ధన్ రెడ్డి

కదిరి, అనంత సూర్య: రాబోయే కదిరి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల సమన్వయంతో పనిచేసి బీజేపీకి మంచి విజయాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జాతీయ నాయకులు ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. కదిరిలో బీజేపీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవానంద్ పాల్గొని మాట్లాడారు. ప్రతి వార్డులో పార్టీ బలాబలాలను అంచనా వేసి బలమైన అభ్యర్థులను గుర్తించాలని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. దేవానంద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాలను పార్టీ సీనియర్ నాయకులకు అందజేయాలని తెలిపారు. అభ్యర్థుల సామర్థ్యం, ప్రజాదరణ ఆధారంగా ఎంపిక



చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఉత్తమ్ రెడ్డి,



సుధర్శన్, వెంకటేష్, హరీ నాయక్, హసనాపురం చంటి, డి.ఎల్. ఆంజనేయులు, గిరిజమ్మ, నాగార్జున తదితరులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉరుము, కొమ్ము కళాకారుల పెన్షన్ దరఖాస్తులు స్వీకరించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు






పుట్టపర్తి, అనంత సూర్య: ఉరుము, కొమ్ము కళాకారుల పెన్షన్ దరఖాస్తులను సచివాలయ సిబ్బంది తిరస్కరిస్తున్న విషయంపై శ్రీ సత్యసాయి జిల్లా మాల మహానాడు అధ్యక్షులు ఎం.ఎన్. మూర్తి మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన ఉరుము, కొమ్ము కళాకారులు గత ఐదు రోజులుగా తమ గ్రామ సచివాలయాల్లో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తున్నప్పటికీ, సంప్రదాయ వృత్తుల కింద తమ వృత్తికి ప్రభుత్వ అనుమతి లేదంటూ వెల్ఫేర్ అసిస్టెంట్లు దరఖాస్తులను స్వీకరించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్.. సంప్రదాయ వృత్తుల కింద ప్రభుత్వం కొన్ని వృత్తులకే అనుమతి ఇచ్చిందని, ఉరుము, కొమ్ము కళాకారుల వృత్తికి సంబంధించి ప్రస్తుతం అనుమతి లేదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, సంబంధిత అధికారులు, మంత్రుల దృష్టికి ఫ్యాక్స్ ద్వారా తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తుది నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు ముఖ్య సలహాదారు సోదనపల్లి రామాంజనేయులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గొల్లపల్లి నాగేంద్ర, ఉరుము కళాకారులు మేడాపురం సల్లప్ప, వెంకటంపల్లి వరప్రసాద్, వెంకటంపల్లి పక్కీరప్ప, ఒంటికొండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ బి ఎ గుర్తింపు సాధించిన ధర్మవరం పాలిటెక్నిక్‌ను సందర్శించిన మంత్రి

ధర్మవరం, అనంత సూర్య: ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని అన్ని కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు 2029 డిసెంబరు 31 వరకు పొడిగించబడిన సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ మంగళవారం కళాశాలను సందర్శించారు. ఎన్ బి ఎ గుర్తింపు సాధించేందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, భవిష్యత్తులో ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సాంకేతిక విద్యతో ధర్మవరం విద్యార్థులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కళాశాలలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా ఉన్నత లక్ష్యాలను



సాధించేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. సివిల్ సర్వీసెస్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ధర్మవరంలోని సంస్కృతి సేవా సమితి సహకారంతో ఉచిత కోచింగ్ అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కళాశాల అభివృద్ధికి కంప్యూటర్ ల్యాబ్ ఆధునీకరణ, ఏసీల ఏర్పాటు, కాంపౌండ్ వాల్ నిర్మాణం తదితర అవసరాలను సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏటా 7--8 జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని, కంపెనీల సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు




వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు, శాఖాధిపతులు బాలస్వామి, హరిబాబు, సీనియర్ అధ్యాపకులు కళ్యాణి బాలజ్యోతి, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# 80 శాతం రాయితీపై ఉలవ విత్తనాల పంపిణీ

## - ఖాళీ భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

పుట్టపర్తి, అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లాలో ఖాళీగా ఉన్న భూములను సాగులోకి తీసుకురావడానికి వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 1,97,518 హెక్టార్లు కాగా, ప్రస్తుతం 1,16,099 హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. ఇంకా 81,419 హెక్టార్ల భూమి సాగు కావాల్సి ఉంది. ఖాళీ భూముల్లో ఉలవ, పెసర, అలసంద, జొన్న తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ సూచించింది. జిల్లాలోని అన్ని మండలాల్లో ఉలవ విత్తనాలను 80 శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు జిల్లాలో సాగు చేసిన పంటల్లో 95 శాతం ఈ-పంట నమోదైనట్లు అధికారులు తెలిపారు. మిగిలిన రైతులు కూడా వెంటనే ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ-పంటలో నమోదు చేసుకున్న పంటలకే ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగినప్పుడు ప్రభుత్వ బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు. రైతులు బీమా కోసం నమోదు చేసిన పంటనే పొలంలో సాగు చేయాలని అధికారులు సూచించారు

# సామాన్య భక్తుడిగా గణనాథుని సేవలో ఎస్పీ సతీష్ కుమార్

## - ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

శ్రీ సత్యసాయి జిల్లా, ప్రతినిధి అనంత సూర్య: వినాయక చవితి వేడుకల సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ధర్మవరం, రామగిరి సర్కిల్ ప్రాంతాల్లో పర్యటించి వినాయక మండపాలు, నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. పలు మండపాలను సందర్శించిన ఆయన సామాన్య భక్తుడిలా భక్తులతో మమేకమై నేలపై కూర్చుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశమైన ఎస్పీ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సోదరభావంతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించరాదని, మద్యం సేవించి అవాంఛనీయ చర్యలకు పాల్పడకూడదని



హెచ్చరించారు. నిమజ్జన ఊరేగింపులు క్రమపద్ధతిలో నిర్వహిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. ధర్మవరం చెరువులో నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాలపై నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలు, డ్రోన్ టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. అనంతరం కనగానపల్లి, తూముచెర్ల, తగరకుంట, మామిళ్లపల్లి గ్రామాల్లో వినాయక వేడుకలను పరిశీలించి భక్తులతో మమేకమయ్యారు. ప్రజలు, నిర్వాహకులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు. ఈ పర్యటనలో డీఎస్పీ బి.వి. జగన్నాథ్ రాజు, సీఐలు జయ నాయక్, మహమ్మద్ అలీ, ఎస్ఐలు ఇషాక్ భాష, రిజ్వాన్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి: మంత్రి సవిత

పెనుకొండ, అనంత సూర్య: నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు పడిపోతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలు, కాలనీలను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు. పనిచేయని బోర్లను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో







తాగునీటి సమస్యపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని, అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా నీటి కొరత లేకుండా చూడాలని మంత్రి సవిత స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై మంత్రి సత్యకుమార్‌కు వినతులు

## ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందాలి: మంత్రి

ధర్మవరం, అనంత సూర్య: ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ప్రజలు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌ను కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను మంత్రి ఓపికగా విని, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రధానంగా రెవెన్యూ, విద్యుత్ సరఫరా, వీధి దీపాలు, తాగునీరు, సాగునీరు తదితర సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి



సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం కోరగా, అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. చేనేత కార్మికులు నూతన పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలపై వినతులు సమర్పించారు. అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగుల పింఛన్లకు సంబంధించిన సమస్యలను కూడా ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.

# ట్రిల్లిస్ స్కూల్ ఘటనపై కలెక్టర్‌కు వినతి

సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి





అనంతపురం, అనంత సూర్య: ట్రిల్లిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బెస్త కులానికి చెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బెస్త, మత్స్యకార సంఘాల నాయకులు మంగళవారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్‌ను కలిసిన సంఘాల నాయకులు ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్త పవన్‌కుమార్, బెస్త సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెస్త భాస్కర్, నగర అధ్యక్షుడు బెస్త నాగరాజు, ట్రెజరర్ సుధ గిరిధర్, జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు బెస్త వెంకటేష్, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంగముని, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జశ్వంత్ వ్యాస్, జిల్లా ఇన్‌చార్జి బెస్త శివకుమార్, ఇతర సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 8వ సీనియర్ స్టేట్ లెవల్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్



పుట్టపర్తి, అనంత సూర్య: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని రామ్--లక్ష్మణ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 8వ సీనియర్ స్టేట్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో 44 జట్లు పాల్గొన్నాయి. దీంతో పోటీలను ఒక రోజు పొడిగించి సెప్టెంబరు 12 నుంచి 15 వరకు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. పురుషుల విభాగంలో నంద్యాల జిల్లా ప్రథమ, శ్రీకాకుళం ద్వితీయ, విజయనగరం జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం ప్రథమ, నెల్లూరు ద్వితీయ, పల్నాడు జిల్లా తృతీయ స్థానాలు సాధించాయి. క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రీడా కోటాలో 3 శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బేస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కిషోర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సమకోటి ఆదినారాయణ, బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, సీఈవో మాధవరావు, జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్, రామచంద్రనాయక్, మోహన్ నాయుడు, వివిధ జిల్లాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అనంత సూర్య
తెలుగువార్త
బుధవారం 16 సెప్టెంబరు 2026

# ప్రజాప్రతినిధులకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆత్మీయ విందు

## 'అనంత' అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల సమన్వయం ఎంతో కీలకం









**అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జిల్లా ప్రజాప్రతినిధులకు ఆత్మీయ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి టిజి.భరత్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, స్థానిక సంస్థల ఎన్నికల అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జ్ యేసు ప్రతాప్‌రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు, అనంత పురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, సింగన మల ఎమ్మెల్యే బండారు శ్రావణి తదితరులు హాజరయ్యారు. ఈ ఆత్మీయ విందు కార్యక్రమం ప్రజాప్రతినిధుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరంపై కార్యక్రమంలో చర్చ జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య ఆత్మీయత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ఈ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# ఉద్యోగాలడిగితే.. నిఘా పెడతారా?

**ప్రశ్నించే యువతను నేరస్తులుగా చూడటం సరికాదు**

**మీడియాతో వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్**

**అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న యువతపై నిఘా పెడుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కని, ఆ హక్కును వినియోగించుకునే విద్యార్థులు, నిరుద్యోగులను నేరస్తులుగా చూడటం సరికాదన్నారు. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, సైబర్ విభాగాల పేరుతో నిరుద్యోగుల వాట్సాప్ గ్రూపులు, గ్రూప్ అడ్మిన్లు, సోషల్ మీడియా కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. గత నిరసనల్లో పాల్గొన్న యువత ఫొటోలు, వీడియోల ఆధారంగా రికార్డులు తయారు చేస్తున్నారనే ఆరోపణలపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. యువతకు మార్గనిర్దేశం చేసే కోచింగ్ సెంటర్లు, అధ్యాపకులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కూడా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. చట్టపరమైన తనిఖీలు అవసరమైన చోట జరగాల్సిందేనని, వాటిని రాజకీయ ఒత్తిడికి సాధనంగా ఉపయో గించడం మాత్రం అధికార దుర్వినియోగమేనన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని ప్రత్యర్థులుగా చూడటం ప్రజాస్వా మ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. యువత ఫోన్లు, సోషల్ మీడియాపై నిఘా పెట్టడం కంటే వారి భవిష్యత్తుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తారు ? నిరుద్యోగ భృతి హామీ పరిస్థితి ఏమిటి ? ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం ఎప్పుడు స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తుంది ? అనే అంశాలపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. యువతను భయపెట్టడం ద్వారా నిరు ద్యోగ సమస్యను దాచలేరని, తక్షణమే వారితో చర్చించి ఉద్యోగాలపై స్పష్టమైన భరోసా కల్పించాలని కోరారు.




# 'అనంత'లో రూ.107.71 కోట్ల కీలక ప్రాజెక్టులకు శ్రీకారం

**అమృత్ 2.0 కింద తాగునీరు, మురుగునీటి వ్యవస్థలకు భూమిపూజ చేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**





**అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

అనంతపురం నగరంలో తాగు నీరు, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో అమృత్ 2.0 పథకం కింద రూ.107.71 కోట్ల విలువైన రెండు భారీ ప్రాజెక్టులకు మంగళవారం భూమిపూజ జరిగింది. పాతూరులోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ కాంపౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తదితరులు పాల్గొన్నారు. రూ.37.39 కోట్లతో చేపట్టనున్న వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌లో 5.47 కి.మీ. గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్, 12.27 కి.మీ. కొత్త డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం ద్వారా అదనంగా 5,200 కిలోలీటర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని కల్పించనున్నారు. మారుతి నగర్, సంగమేశ్‌నగర్, ఆదర్శ్‌నగర్, గాంధీ పార్క్, జనశక్తినగర్ ప్రాంతాలకు ఈ సదుపాయాలు అందనున్నాయి. అదేవిధంగా రూ.70.32 కోట్లతో సీవరేజ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ స్కీమ్ చేపట్టనున్నారు. ఇందులో 25 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగునీటి శుద్ధి కేంద్రం, 5.47 కి.మీ. సీవర్ ట్రంక్ మెయిన్, 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయనున్నారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో నగర తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని అన్నారు. అమృత్ 2.0 ద్వారా చేపట్టిన ఈ ప్రాజెక్టులతో నగరంలో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. తాత్కాలిక పరిష్కారాలకు బదులుగా భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. అమృత్ 2.0 కింద రూ.107 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నగరంలోని 80 వేల ఇళ్లలో ప్రస్తుతం 40 వేల ఇళ్లకు ఇంటింటికీ నీరు అందుతోందని, మిగిలిన ఇళ్లకు కూడా నీరు అందించడమే ఈ ప్రాజెక్టుల లక్ష్యమన్నారు. పనులను ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమం అనంతరం ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా శాఖల డైరెక్టర్లు రంగాచారి, బెస్త పవన్, పోతుల నరసింహులు, పిఎల్‌ఎన్ మూర్తి, కడియాల కొండన్న, పరమేష్, బొమ్మినేని శివ, రాజశేఖర్, నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, ఈఈ షాకిర్, డిఈఈ జ్యోతి, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఆయా శాఖల అధికారులు, జిందాల్ సంస్థ ప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



# వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత

## వెంకటాపురంలోని మండపాలలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సునీత



**రామగిరి, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో వినాయక చవితి వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. స్థానిక యువత, ప్రజలతో కలిసి ఆమె గ్రామంలోని వినాయకమండపాలలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, వేద పండితులు సునీతమ్మకు తీర్థప్రసాదాలు అందించి, ఆశీర్వచనాలు అందజేశారు. ముందుంగా ఆమె ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుని కృపతో నియోజకవర్గ ప్రజలందరికీ, ముఖ్యంగా రైతులు పాడి పంటలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# లక్షలు పెట్టి కొన్న స్థలాలకే రక్షణ లేదా?

## నకిలీ పత్రాలతో పేదల ఇళ్ల స్థలాలపై కబ్జా యత్నం - అధికారులు వెంటనే స్పందించాలని బాధితుల డిమాండ్ - ప్రాణహాని ఉందంటున్న బిందెల కాలనీ బాధితులు



**అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

నగరంలోని రెండో డివిజన్ పరిధిలోని బిందెల కాలనీలో నివాసం ఉంటున్న సుమారు 21 మంది పేద కుటుంబాల ఇళ్ల స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడాలని బాధితులు కోరారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు శిరసాల అంజి మాట్లాడుతూ.. నగరంలోని రెండవ డివిజన్లో సర్వే నెంబర్ 75-4, 189-3లలో చట్ట ప్రకారం ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, అక్రమదారులొచ్చి బెదిరింపులకు పాల్పడుతూ మా స్థలాలను కబ్జా చేయాలని చూస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన తమ ఇళ్ల స్థలాలపై కొందరు నకిలీ పత్రాలు సృష్టించి, అవి తమవేనంటూ సింగనమలకు చెందిన ఏకుల రత్నమ్మ, చిదంబర దొర, మురళీమోహన్ లు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ స్థలాలకు సంబంధించిన పత్రాలు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు అక్రమంగా హక్కులు కల్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు వాపోయారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడటంతో పాటు తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏకుల రత్నమ్మ, చిదంబర దొర, మురళీమోహన్ తదితరుల నుంచి తమకు ముప్పు ఉందని బాధితులు ఆరోపించారు. అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి స్థలాలపై సమగ్ర విచారణ చేపట్టి, తమకు రక్షణ కల్పించడంతో పాటు తమ ఇళ్ల స్థలాలను కబ్జాల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు అత్తారి మైనుద్దీన్, సుబహాన్, గాజుల జయమ్మ, జరీనా, ఎర్రిస్వామి, బొగ్గుల శకుంతల, నాగమ్మ, మహబూబ్‌బాషా, హాజీవలి, ఎరుకుల సుంకమ్మ, కంతా సురేష్, వెంకటాద్రి, భాను, రహంతుల్లా, కంతా పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేసిన మంత్రి టీజీ భరత్

## అర్బన్ టీడీపీ కార్యాలయానికి విచ్చేసిన ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్ స్వాగతం పలికిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్




**అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచే విధంగా పని చేయాలని ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి టి.జి.భరత్ విచ్చేసారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజులతో కలిసి నూతన కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవిలతో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో టీజీ భరత్ సమావేశమయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై నాయకులతో చర్చించారు. ఎన్నికల్లో గెలుపే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సమన్వయంతో, అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, స్థానిక సంస్థల్లో టీడీపీ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలు, వివిధ విభాగాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు సాయం



**అనంతపురం, సెప్టెంబర్ 15 అనంత సూర్య :**

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మల మురళి ఆధ్వర్యంలో రెండు పేద కుటుంబాలకు సహాయం అందించారు. పాతూరులోని ఓ ఇంటిలో నివాసం ఉంటున్న రేష్మ, ముస్తఫా దంపతులు.. వీరికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ముస్తఫా ఆటో నడపతో జీవనం సాగించేవాడు. రేష్మ పూలు కుడుతూ ముస్తఫాకు తోడుగా కుటుంబాన్ని పోషించేది. ఇటీవల కాలంలో రేష్మకి బోదకాల వ్యాధి సోకి కుడికాలు పెద్దగా వాపు వచ్చింది. నడవలేని పరిస్థితిలో ఇంటిలోనే ఉంటుంది. ముస్తఫా గుండె సంబంధిత వ్యాధితో బైపాస్ సర్జరీ జరిగింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో నిత్యం సతమతమవుతున్న ఆ కుటుంబాన్ని నిర్మలమురళి పరిశీలించింది. వారికి మంగళవారం 42 రకాల నిత్యవసర వస్తువులతో పాటు ఒక బియ్యం ప్యాకెట్, అలాగే రూ.5 వేల నగదును అందించారు. అదేవిధంగా ఖాజానగర్‌లో రాము, భారతి దంపతులు జీవిస్తుండగా.. రాము ప్లంబర్ పని చేసేవాడు. అనారోగ్యం నిమిత్తం 7 నెలలుగా మంచానికే పరిమితమయ్యాడు. వీరి పరిస్థితిని గమనించిన నిర్మలమురళి.. వారికి 42 రకాల నిత్యవసర సరుకులతో పాటు ఒక బియ్యం పాకెట్ రూ.5 వేల నగదును అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. ఈ రెండు కుటుంబాలకు సహాయం చేయటానికి ట్రస్టు సభ్యురాలు అనీస్ ఫాతిమా సహకరించారని తెలిపారు. ఈ రెండు కుటుంబాలకు దాదాపు రూ.22 వేల ఖర్చుతో సహాయం అందించినట్లు చెప్పారు. నిత్యవసరాలతోపాటు సేకరించిన దుస్తులను అందించామన్నారు. ఈ రెండు కుటుంబాల పరిస్థితి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారి సతమతమవుతున్నారని తెలిపారు. వీలున్న దాతలు ముందుకు వచ్చి ఇలాంటి పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు ఏదో ఒక రూపంలో సహాయం చేస్తూ వస్తున్నామని, ఇందుకు సహకరిస్తున్న దాతలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవసరంలోనూ ఆపదలోనూ ఉన్న పేదలకు వీలున్న ప్రతి ఒక్కరు సహాయం చేయాలని నిర్మలమురళి కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405